సాక్షి
పల్నాడు
మంగళవారం, 25, ఏప్రిల్, 2023



కంటైనర్ పల్టీ

కొల్లూరు: కరకట్టపై వెళ్తున్న ఓ కంటైనర్ అదుపు తప్పి పల్టీ కొట్టిన ఘటన కొల్లూరు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఘటనలో ఎవరూ గాయపడలేదు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.5,600, మోడల్ ధర రూ.4,800 వరకు పలికింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

యార్డుకు 1,28,502 మిర్చి బస్తాలు రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,28,502 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,259 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,646 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రత్తిపాడులో 50.4 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 50.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... వట్టిచెరుకూరు 15.4 మి.మీ., కాకుమాను 15.2, పొన్నూరు 8.8, చేబ్రోలు 4, గుంటూరు పశ్చిమ 2, దుగ్గిరాల 1.2, గుంటూరు తూర్పులో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

సాగర్ నీటిమట్టం




విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523.10 అడుగుల వద్ద ఉంది. ఇది 154.9888 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 4,940, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 6,740 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,416 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.

115 మంది నైట్ వాచ్‌మెన్‌ల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని 115 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు డీఈఓ పి.శైలజ సోమవారం చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నెలకు రూ.6వేల వేతనంపై రాత్రి వేళల్లో కాపలాదారుల నియామకానికి సంబంధించిన ప్రక్రియను ఈనెల 27వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలను డీఈఓ ఆదేశించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా భర్తకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి నియామకం చేపట్టాలని సూచించారు. వీలుకాని పక్షంలో ఎక్స్ సర్వీసు మ్యాన్, స్థానికంగా ఉన్న వ్యక్తిని పేరెంట్ కమిటీ ఆధ్వర్యంలో నియమించాల్సి ఉందని తెలిపారు. నాడు – నేడు ద్వారా ఆధునికీకరించిన ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విలువైన సామగ్రి భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం రాత్రి కాపలాదారుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

రామానుజుల వారికి తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి కనకాంబరం పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.

అసమ్మతి.. అధోగతి

టీడీపీలో తీవ్ర స్థాయిలో వర్గ పోరు

- సత్తెనపల్లికి ఇన్‌చార్జిని ప్రకటిస్తారా?
- అక్కడ ఇప్పటికే మూడు వర్గాలు... తాజాగా రంగంలోకి కన్నా
- పెదకూరపాడులో నిస్తేజంలో క్యాడర్
- తాడికొండలో శ్రావణ్ కుమార్‌కు రాయపాటి వర్గం చెక్..
- తమ వర్గం నుంచి మరో అభ్యర్థిని తెరపైకి
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు రోజుల పర్యటనకు చంద్రబాబు...



సత్తెనపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద చంద్రబాబు ఫ్లెక్సీని చింపేసిన మరో వర్గం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనను ఎలా విజయవంతం చేయాలో తెలియక పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఆయన పర్యటించనున్న మూడు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేకపోవడం మరోవైపు వర్గాలతో రోడ్డెక్కుతుండటంతో పర్యటన విజయవంతం చేయడం వారికి కత్తిమీద సాములా మారింది. పట్టణంలో అయితే ఒక్కో వార్డు నుంచి నాలుగు వందల మంది, గ్రామంలో అయితే వెయ్యి మందిని సమీకరించాలని పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చి తెలుగుదేశం టీషర్ట్, పసుపు చీర ధరించి వచ్చేలా చూడాలని చెప్పడంతో వారు దీనిపై దృష్టి పెట్టారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పెదకూరపాడు, సత్తెనపల్లి, తాడికొండ నియోజకవర్గాల్లో చంద్రబాబునాయుడు పర్యటన సాగేలా షెడ్యూల్ రూపొందించారు.

అసమ్మతి రాగం.. అంతర్గత కలహాలు

పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు సొంతపార్టీలోనే అసమ్మతి రాగం వినిపిస్తోంది. 2019లో ఓటమి తర్వాత కనీసం కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా పోవడం, సొంత వ్యాపారాలపై దృష్టి పెట్టడంతో కార్యకర్తలు పూర్తి స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నూతలపాటి వెంకటశివ బహిరంగంగానే కొమ్మాలపాటి తీరును ఎండగడుతూ మీడియాకి ఎక్కారు. అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన ఎన్నారై వట్టికుంట శేషగిరిరావు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ పేరుతో పెద్ద ఎత్తున ఎడ్లపందేలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, కొమ్మాలపాటిని పిలవకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల సంక్రాంతి పండుగ రోజు పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన మరో ఎన్నారై భానుప్రకాష్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని తీసుకొచ్చి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి కొమ్మాలపాటి శ్రీధర్, ఆయన అనుచరగణం డుమ్మాకొట్టారు. ఇటీవల పెదకూరపాడు మండలం తెలుగు మహిళ జిల్లా నాయకుల మధ్య వాట్సాప్ వేదికగా మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్నారు. కేడర్‌ను నడిపించలేని పరిస్థితిలో కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నాడని జిల్లా తెలుగు మహిళ కార్యవర్గ సభ్యురాలు సుజాత బహిరంగంగానే విమర్శలు చేశారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా చంద్రబాబు రోడ్‌షో కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేశారంటూ కొమ్మాలపాటి వర్గంపై శేషగిరిరావు వర్గం గొడవకు దిగడం గమనార్హం.

నాలుగు స్తంభాలాట..

సత్తెనపల్లి నియోజకవర్గంలో నాలుగు స్తంభాలాట నడుస్తోంది. పార్టీ ఇన్‌చార్జ్ పదవి కోసం మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుమారుడు కోడెల శివరాం, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి)లు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురికి పోటీగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కూడా సత్తెనపల్లిపై దృష్టి పెట్టారు. ఇప్పటివరకూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను ఖరారు చేయలేదు. కలిసికట్టుగా పనిచేయమని చంద్రబాబు సూచించినా మూడు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ ఎదుట ఒక వైపు కోడెల శివరాం, మరో వైపు వైవీ ఆంజనేయులు చిన్న షెడ్లు ఏర్పాటు చేసి అన్నా క్యాంటీన్ పేరుతో ఒక పూట భోజనం పెడుతున్నారు. ఇలా కొద్ది రోజులు పెట్టిన తరువాత కోడెల శివరాం మొబైల్ క్యాంటీన్ ఏర్పాటు చేసి ఒక పూట భోజనం పెడుతున్నారు. ఇక మన్నెం శివనాగమల్లేశ్వరరావు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్ పేరుతో మధ్యాహ్నం పూట భోజనం పెడుతున్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఈ నెల 20న ఎన్టీఆర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఒక వర్గం చించివేసింది. చంద్రబాబు ఫ్లెక్సీలను చించిన వారిని అరెస్ట్ చేయాలని ఆ పార్టీ తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షుడు యెల్లినేడి శ్రీనివాస్ ఆందోళన చేపట్టారు. రెండురోజుల క్రితం చంద్రబాబు రాక సందర్భంగా జనసమీకరణ అంశంపై జరిగిన సమావేశం కూడా రసాభాసగా మారింది.

వర్గపోరుతో సతమతం..

తాడికొండ తెలుగుదేశంలో వర్గ విబేధాలు భగ్గుమంటున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల నుంచే కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు ఈయనను అభ్యర్థిగా పెట్టడంపై గుర్రుగా ఉండటంతో పాటు సీటిస్తే ఓడి స్తాం అంటూ చంద్రబాబు నాయుడుకే బహిరంగంగా అల్టిమేటం జారీ చేశారు. ఆ సమయంలో బాపట్ల ఎంపీగా కొనసాగుతున్న మాల్యాద్రిని ఇక్కడ సమన్వయకర్తగా వేయడంతో శ్రావణ్ కుమార్ వర్గం కూడా గట్టిగా వ్యతిరేకించడంతో సీటు కేటాయించినా ఓటమి పాలయ్యాడు. అయితే ప్రస్తుతం ఆయనకు నియోజకవర్గంలోని 4 మండలాల్లో ఓ వర్గం బలంగా సీటు ఇవ్వకుండా పావులు కదుపుతుంది. ఇందులో భాగంగా తొలి నుంచి ఈ నియోజకవర్గంపై పట్టున్న రాయపాటి సాంబశివరావు, తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామానికి చెందిన తోకల రాజవర్ధన్‌ను నేరుగా రంగంలోకి దింపి తాము రాజవర్ధన్‌కు సీటిస్తే గెలిపిస్తామంటూ బహిరంగంగా ప్రకటించారు. అయితే తుళ్లూరు మండలంలో దళిత జేఏసీలో చురుగ్గా పనిచేస్తున్న కంభంపాటి శిరీష వర్ల రామయ్య కోటరీ నుంచి అభ్యర్థిగా రంగంలోకి దిగాలనే యోచనతో శ్రావణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా పావు లు కదుపుతుంది. ఇప్పటికే ఆమె తుళ్లూరు మండలంలో ప్రధాన సామాజిక వర్గంలోని ఓ గ్రూపుతో సన్నిహితంగా ఉంటూ రాజకీయం నడుపు తున్నారు. అమరావతి జేఏసీలో సభ్యుడిగా ఉన్న కొలికపూడి శ్రీనివాసరావు కూడా మరో వర్గాన్ని నడుపుతున్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్, జేసీ

నరసరావుపేట: స్పందనకు అర్జీల ద్వారా వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో కలిసి ప్రజల నుంచి 100 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన అధికారులకు పల్నాడు జిల్లాకు సంబంధించిన రుద్ర ఫౌండేషన్ ఐ.వెంకటరత్నం భోజన వసతిని కల్పించారు. వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

జిల్లాకు 250 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు...

జిల్లాకు 250 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను కేటాయించడం జరిగిందని, మండలానికి ప్రధానమంత్రి ఫార్మైషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పది చొప్పున ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. సోమవారం స్పందన సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ ఏరియా ఆసుపత్రిలో రూ.4.5కోట్లతో ఏర్పాటు చేస్తున్న రెడ్ క్రాస్ కాంపోనెంట్ బ్లడ్ సెంటర్‌కు సంబంధించి ఇంకా రూ.20లక్షలు అవసరం ఉన్నందున జిల్లా అధికారులు ఒక్కొక్కరు రూ.1100లు చెల్లించి సొసైటీ మెంబర్‌షిప్ కార్డును తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మెంబర్‌షిప్ కార్డును ఎక్కడైనా వినియోగించుకోవచ్చునని తెలిపారు. బ్లడ్‌సెంటర్ ఏర్పాటుకు పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు రూ.5లక్షలు, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి రూ.5లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన నిధులతో బ్లడ్ సెంటర్‌కు కావాల్సిన సామగ్రిని సమకూర్చుకోవడం జరిగిందన్నారు.

పేదలంతా సీఎం వైఎస్ జగన్ వైపే

- దేశ చరిత్రలో 80శాతం ప్రజల మద్దతు పొందిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే..
- 'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందనతో ప్రతిపక్షాలకు వణుకు
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పేదలను అభివృద్ధి బాటలో సీఎం నడిపిస్తున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా మాచర్లలోని తన క్యాంపు కార్యాలయంలో మూడు జిల్లాల యువజన విభాగం కన్వీనర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, పార్టీ నియోజక వర్గ పరిశీలకుడు పురుషోత్తం, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో 80శాతం మంది మద్దతు పొందిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి వెళుతున్న తమ పార్టీ నేతలకు అందుతున్న అపూర్వ స్వాగతమే దీనికి సాక్ష్యమన్నారు. కోటి మంది మిస్డ్ కాల్ ఇచ్చి మెగా పీపుల్స్ సర్వే లో పాల్గొనటం రికార్డు అని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజు రోజుకి సీఎం జగన్‌పై ప్రజల ఆదరణ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలకు దిక్కుతోచడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు పొందలేని వారందరూ మెగా సర్వేను చూసి భయపడి సీఎం జగన్ పై వ్యక్తిగత విమర్శలకు దిగజారేస్థాయికి చేరారన్నారు. నిజమైన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించి, అన్ని వర్గాలలో ఆత్మవిశ్వాసం నింపి, పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తున్న గొప్ప నాయకుడుగా సీఎం జగన్ చరిత్రలో నిలుస్తారన్నారు. మాచర్ల నియోజక వర్గంలో ఇప్పటివరకు 75వేల గృహాలను సందర్శించి పేద ప్రజల మద్దతు పొందటం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో నవరత్నాల పథకాలు నూరు శాతం అమలు చేసి మరోసారి సీఎం జగన్ తిరుగులేని నాయకుడుగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఉత్తమ అవార్డులు

- కలెక్టరేట్‌లో పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్
- రాష్ట్రస్థాయి అవార్డు పొందిన పెదకూరపాడు మండలం కాశిపాడు పంచాయతీ



అవార్డులు పొందిన పంచాయతీ సర్పంచులు, అధికారులతో జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం–2023 సందర్భంగా కలెక్టరేట్లోని బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో అవార్డులు పొందిన పంచాయతీ సర్పంచులకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం దుశ్శాలువాతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రస్థాయిలో పిల్లల స్నేహపూర్వక గ్రామ పంచాయతీ అవార్డును పెదకూరపాడు మండలం కాశిపాడు పంచాయతీకి జిల్లా కలెక్టర్ అందజేశారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో పేదరికంలేని మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీగా ఈపూరు మండలం కొండ్రముట్ల, భద్రత కల్గిన గ్రామ పంచాయతీ అవార్డును నాదెండ్ల మండలం ఎల్లపాడు, నీటి సమృద్ధి కల్గిన గ్రామ పంచాయతీ అవార్డును నాదెండ్ల మండలం తూబాడు పంచాయతీ, మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ అవార్డును పెదకూరపాడు మండలం చినమక్కెన పంచాయతీ, ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ అవార్డును పిడుగురాళ్ల మండలం కోనంకి పంచాయతీ, సుపరిపాలన కల్గిన గ్రామపంచాయతీ అవార్డును పిడుగురాళ్ల మండలం పందిటివారిపాలెం, పరిశుభ్రమైన, హరిత గ్రామపంచాయతీ అవార్డును రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం పంచాయతీ, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల గ్రామపంచాయతీ అవార్డును శావల్యాపురం మండలం శానంపూడి పంచాయతీలకు అధికారులతో కలిసి ఆయా సర్పంచులకు కలెక్టర్ అందించారు. జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్‌ఓ కె.వినాయకం పాల్గొనగా డీపీఓ భాస్కర్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యాటకంగా పల్నాడు జిల్లా అభివృద్ధి

- సమగ్ర చర్యలకు వారంలో ప్రణాళిక సిద్ధం చేయాలి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. వచ్చే వారంలో ఈ మేరకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక, మండల అధికారులతో పర్యాటక రంగం అభివృద్ధిపై ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పార్క్‌ల ఏర్పాటుకు భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డులో చెత్తను తొలగించి, పార్క్‌కు స్థలాన్ని సేకరించాలని చెప్పారు. ఇస్సపాలెం, కత్తువ చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా జరిగేలా అధికారులు ఉదయాన్నే క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారులు, పార్కుల గోడలకు ఆహ్లాదకరమైన రంగులు వేసేందుకు నివేదిక అందించాలని కోరారు. అమరావతిలో ధ్యాన బుద్ధ ప్రతిమ ఎదురుగా ఏర్పాటు చేసిన టెంపుల్ టూరిజం, ప్రసాదం పథకాల నిధుల ద్వారా కన్వెన్షన్ సెంటర్, పార్కు, మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు టికెట్ కేంద్రాలను ఏర్పాటు చేసి, వారం రోజుల్లో అవకాశం కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొండవీడు కోట అభివృద్ధి కోసం అటవి, పర్యాటక, రవాణ శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు రూపకల్పన చేయాలని స్పష్టం చేశారు. మాచర్లకు సమీపంలో ఉన్న నాగార్జున సాగర్ సందర్శనతో పాటు సాగర్ కుడి కాలువ వెంట ఉన్న కాలువకు ర్యాంపు ఏర్పాటు చేసి పార్క్ అభివృద్ధి చేసి, పర్యాటకులు సేద తీరేందుకు పలు రకాల మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. జిల్లా అభివృద్ధి మండలి వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పర్యాటక శాఖ ఇన్‌చార్జ్ జిల్లా అధికారి బీజే బెన్ని, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు సబ్సిడీపై నిత్యావసరాలు



క్యాంటీన్‌లో వస్తువులు పరిశీలిస్తున్న ఎస్పీ

నరసరావుపేట: జిల్లా పోలీసులకు అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందించటమే ధ్యేయంగా క్యాంటీన్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నిత్యవసరాల సబ్సిడీ క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ సబ్సిడీ క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ నిత్యవసర సరకులతో పాటు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ట్రావెల్ బ్యాగులు, ఇతర వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు.అన్ని సరుకులను అందుబాటులో ఉంచాలని పోలీస్ సంక్షేమ అధికారి వెంకటరమణను ఆదేశించారు. అదనపు ఎస్పీ ఏఆర్ రామచంద్రరాజు, డీఎస్పీలు విజయ భాస్కరరావు, జయరాం ప్రసాద్, యు.రవిచంద్ర, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితం అబద్ధాలమయం

- టీడీపీ హయాంలో పెదకూరపాడుకు ఒరిగిందేమీ లేదు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

నగరంపాలెం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితమంతా అబద్ధాల మయమేనని, ఆయన సీఎంగా ఉండగా పెదకూరపాడు నియోజకవర్గానికి చేసిందేమి లేదని, కేవలం అసత్యాలు ప్రచారం చేసేందుకే అమరావతి వస్తున్నారని, గతంలో చేసిన అభివృద్ధిని ఏమిటనేది ప్రజలకు తెలియజెప్పి, అప్పుడు అడుగుపెట్టాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు డిమాండ్ చేశారు. గుంటూరు అర్బీఓ కార్యాలయం రోడ్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరరావు సోమవారం విలేకర్లతో మాట్లాడారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో నాడు– నేడు కింద రూ.62 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశామని, క్రోసూరు మండలంలో రూ.7.5 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల, అచ్చంపేటలో రూ.2 కోట్లతో ఆసుపత్రి, పెదకూరపాడులో రూ.8.25 కోట్లతో అత్యాధునిక వైద్య వసతులతో ఆసుపత్రిని నిర్మించామని అన్నారు.
- నియోజకవర్గంలో 13 వేల మందికి జగనన్న ఇంటి స్థలాలను పంపిణీ చేశామని గుర్తుచేశారు. అమరావతి – బెల్లంకొండ మధ్య రెండులైన్ల రహదారిని రూ.150 కోట్లతో, మాదిపాడు – జగ్గయ్యపేట బ్రిడ్జిని రూ.60 కోట్లతో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.
- నియోజకవర్గంలో రూ.1,377 కోట్ల సంక్షేమ పథకాలు వచ్చాయని అన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, మైనింగ్‌ను టీడీపీ వారే దోచేశారని మండిపడ్డారు. గతంలో తవ్విన ఇసుక గుంతల వల్లే గత ప్రభుత్వానికి ఎన్‌జీటీ రూ.100 కోట్లు జరిమానా విధించిందని గుర్తుచేశారు.
- ఈనెల 7న ప్రారంభమైన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఏపీ అంతటా విజయవంతంగా ముగిసిందని అన్నారు. పెదకూరపాడులో ఎనభై వేల కుటుంబాలకు గానూ 60 వేల కుటుంబాలకు సర్వే జరిగిందని, ప్రతి కుటుంబం కూడా సీఎం జగన్‌ను సమర్థిస్తున్నాయని చెప్పారు.

చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ శివశంకర్



స్టాళ్లలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రభుత్వ కార్యక్రమాల్లో చిరు ధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శనలో ఉంచడం జరిగిందన్నారు. రానున్న రోజులలో 24/7 గంటలు పనిచేసే విధంగా చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను అందుబాటులో ఉంచే విధంగా కలెక్టరేట్ ప్రాంగణం వద్ద స్టాల్‌ను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ప్రకృతి వ్యవసాయ అధికారి అమల కుమారి పాల్గొన్నారు.

డెయిరీ మంజూరు పత్రాలు అందజేత

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న జగనన్న బడుగు వికాసం నవోదయంలో దరఖాస్తు చేసుకున్న గురజాలకు చెందిన జల్లి కమలకు(ఏసీ) డెయిరీ ఫారం మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్‌లో ఆమెకు అందజేశారు. గతేడాది డిసెంబర్ 14వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన నవోదయంలో ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ డెయిరీ ఫారం ఏర్పాటుకు రూ.5లక్షలకు గాను 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. రుణాన్ని గురజాల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేసిందని చెప్పారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్‌నాయుడు, నవోదయ కోఆర్డినేటర్ సంజీవ రావు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ పాల్గొన్నారు.

మెగా పీపుల్ సర్వే విజయవంతం

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొల్లా



కోటి కుటుంబాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్ సర్వే తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనడం శుభపరిణామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మెగా సర్వే విజయవంతం కావడంతో కోటి కుటుంబాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 79 లక్షలకు పైగా ఫోన్ ద్వారా ప్రజల స్పందన తెలియజేశారని, దేశ చరిత్రలోనే ఇదొక సువర్ణ అధ్యాయంగా పేర్కొన్నారు. అలాగే వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 1.65కోట్ల కుటుంబాలకు 71,400 కుటుంబాలను సందర్శించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూసి తెలుగుదేశం పార్టీ నాయకులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు.

పట్టణంలో భారీ ర్యాలీ....

జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతం కావడంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం నుంచి సురేష్‌మహల్ మీదుగా శివయ్యస్థూపం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు కుల, మత, పార్టీలకతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంటు వంటి ఎన్నో పథకాలు చదువుకునే పిల్లలకు అందించిన ప్రభుత్వం తమదే అన్నారు.

వందల ఎకరాలు దోచుకున్న మాజీ ఎమ్మెల్యే జీవీ

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన అనుచరులు వందలాది ఎకరాలను దోచుకున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల భూములను కూడా వారికి తెలియకుండా సొంత బావమరిది పేరుపై బదలాయించుకున్నారని చెప్పారు. వందల ఎకరాలు నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముకున్నారని, సాక్ష్యాధారాలతో నిరూపించినట్లు పేర్కొన్నారు. బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో 160 ఎకరాలు పేదలకు పట్టాలు ఇచ్చినట్లు చూపించి వారికి తెలియకుండా ఎమ్మెల్యే బావమరిది నరసింహారావు అమ్ముకున్నారని అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేశారని, సదరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని త్వరలోనే అర్హులైన వారికి పంపిణీ చేస్తామని వెల్లడించారు. అలాగే రేమిడిచర్ల గ్రామంలో 200 ఎకరాలు, ఈపూరు మండలం ఇనిమెళ్లలో 160 ఎకరాలు దోచుకున్నారని అన్నారు. టీడీపీ హయాంలో అంగలూరు, గోపువారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ ఏకంగా చెరువు భూములను కూడా ఆక్రమించుకొని అమ్ముకున్నారని పేర్కొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జీవీ, బయో ఎరువుల పేరుతో నకిలీ కంపెనీలను స్థాపించి రైతులను నిలువున మోసం చేశారని, అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించి చంద్రబాబు మెప్పు కోసం ధన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ నాయకులు బత్తి గురవయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, మాజీ ఎంపీపీ ములకా రామతుల సిరెడ్డి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

- ఐదు బంగారు, నాలుగు సిల్వర్ పతకాలు కైవసం
- వంశీకృష్ణకు రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సురేష్, రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ సాధించిన వంశీకృష్ణ

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో పల్నాడు జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ సాధించాడు. పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు, నాలుగు వెండి పతకాలు కైవసం చేసుకొని పల్నాడు జిల్లా ప్రతిష్ట చాటారు. సబ్ జూనియర్ విభాగంలో 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.కార్తీక్ (గోల్డ్ మెడల్), 66 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ కరీం(గోల్డ్ మెడల్) సాధించారు. జూనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో గురజాలకు చెందిన ఎం.అనుష(బంగారు పతకం), 53 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎస్కే గౌస్(నాలుగో స్థానం), 59 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఫ్రాన్సిస్(సిల్వర్ మెడల్), 59 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన సారబ్(సిల్వర్ మెడల్), 66 కేజీల విభాగంలో వెన్నాదేవికి చెందిన ఎస్.శరత్ (సిల్వర్ మెడల్), 74 కిలోల విభాగంలో పసుపులేటి వంశీకృష్ణ(రెండు గోల్డ్ మెడల్స్) సాధించాడు. 74 కేజీల విభాగంలో ఎస్.ఈశ్వర్ నాలుగో స్థానం కైవసం చేసుకున్నాడు. మాస్టర్స్ విభాగంలో 105 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.జ్యోతిబాబు(రెండు సిల్వర్ మోడల్స్) సాధించాడు. పోటీలల్లో క్రీడాకారులు ప్రతిభ చూపేందుకు పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్ శిక్షణ లోభాగంగా మెలుకువలు నేర్పి తర్ఫీదును అందించాడు. ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌ను ఆంధ్రప్రదేశ్ భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, ఎస్.మణిరత్నం, టీ శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి ఫిర్యాదును శ్రద్ధతో పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- స్పందనలో 55 ఫిర్యాదులు స్వీకారం



కార్యక్రమంలో బాధితుల గోడు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్దేశిత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 55 అర్జీలు స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్ర రాజు, డీఎస్పీలు సి.విజయభాస్కర రావు, బీ ఆదినారాయణ, యు.రవిచంద్ర, జయరాంప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

భర్త రెండో వివాహం చేసుకొని వేధిస్తున్నాడు..

తిరుపతి జిల్లా వెంకటగిరి తొమ్మిదో బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పద్మజ అనే మహిళను రెండో వివాహం చేసుకొని ఇద్దరు పిల్లలైన నన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టి వేధిస్తున్నాడు. దీనికి అత్త, మరిది కూడా సహకరిస్తున్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

-ఎం.శశికళ, లింగంగుంట్ల అగ్రహారం, నరసరావుపేట మండలం

మా భూమిని వేరే వారి పేరుపై నమోదు..

గ్రామంలో తమకున్న రెండుఎకరాల భూమిని వీఆర్వో, తహసీల్దారు కలసి వేరే వారిపేరుపై అడంగల్‌లో నమోదుచేసి భూపత్రాలు మంజూరు చేశారు. ఇదేమిటని అడిగితే వారి నుంచి ఎటువంటి స్పందన ఉండట్లేదు. వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

-బొమ్మ చైతన్య, దిడుగు గ్రామం, అమరావతి మండలం

ఆస్తి అడుగుతున్నామని మరిది దాడి చేస్తున్నాడు

అత్తమామలకు చెందిన తొమ్మిది ఎకరాల ఆస్తిలో మాకు వాటా ఇవ్వాల్సివస్తుందని తాము ఎక్కడ కనబడితే అక్కడ తమపై మరిది దాడిచేస్తున్నాడు. దీనిపై గతంలో పోలీసుస్టేషన్‌లో రెండుసార్లు కేసు నమోదైన అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. వెంటనే అతడిపై చర్యలు తీసుకొని మాకు రక్షణ కల్పించండి.

-తుమాటి శివకుమారి, వెంకటకృష్ణ దంపతులు, మాదినపాడు, దాచేపల్లి మండలం

చేపల వేట సరదా.. ప్రాణం తీసింది



మృతి చెందిన సోనికుమార్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు.. వినుకొండ రూరల్ ఏనుగుపాలేనికి చెందిన తమలాపాకుల సోనికుమార్(19) వినుకొండ డిగ్రీ కళాశాల్లో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సమయానికి వెళ్లగా సరదాగా తన స్నేహితులు ఆరు మంది కలసి వెళ్లారు. ఈ క్రమంలో అడవిపాలెం పవర్ ప్లాంటు సమీపాన చేపలు పడుతుండగా ప్రమాదవత్తు కాలువలో పడిపోయి మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడు తల్లి మహాలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మృతదేహం లభ్యం అయినట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మునమాక రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మునమాక, సంతమాగులూరు మార్గ మధ్యంలో సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి పట్టాలపై మృతి చెంది ఉన్నాడన్నా సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ పి. సుబ్బారావు తెలిపారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగి ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్ళు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని గురవాయపాలెం సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన చింతలపూడి జైశ్రీకర్(22) నరసరావుపేటలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి నరసరావుపేట నుంచి కోటప్పకొండ వెళ్తుండగా గురవాయపాలెం వద్ద జైశ్రీకర్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జైశ్రీకర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీకర్ తల్లి చింతలపూడి నాగలక్ష్మి నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యురాలిగా గతంలో పనిచేశారు.

రాష్ట్ర 'చౌక్‌బాల్' జట్ల ఎంపిక



క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. పట్టణంలోని గ్రీన్ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 27 నుంచి 30 వరకు తెలంగాణలోని షాద్‌నగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, పల్నాడు జిల్లా కార్యదర్శి వై.ఫిలిప్‌రాజు, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా జయపాల్

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన చిలకల జయపాల్‌ను నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ట్రాఫిక్ సమస్యకు చెక్

పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎస్పీ మట్లాడుతూ రైల్వే బ్రిడ్జి నిర్మించేందుకు రెండు నెలల సమయం పట్టనున్న నేపథ్యంలో వన్ వే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే ట్రాఫిక్ లైన్స్, రేడియం స్టిక్కర్లు వంటివి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తోపుడు బండ్ల, చిరు వ్యాపారులు ట్రాఫిక్ కోసం ఏర్పాటు చేసిన లైన్లను దాటి రోడ్లపైకి రాకూడదని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఇప్పటికే పిల్లుట్ల రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తి అయ్యాయని తెలిపారు. రాజీవ్ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఐలాండ్ సెంటర్ల రౌండ్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రౌండ్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకుండా జాగ్రత్త తీసుకుంటామన్నారు. అలాగే ట్రాఫిక్ మళ్లించేందుకు పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీస్ సిబ్బందితో పాటు బైపాస్ సంబంధించిన సిబ్బంది కూడా ఉంటారన్నారు. ఈ నెల 14వ తేదీన పోలీస్ యూనిఫాంలో ఓ వ్యక్తి వాహన దారుల వద్ద ఐదు వేల రూపాయలు వసూలు చేశాడని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన ఎస్పీ, గురజాల డీఎస్పీ మెహెహర్ జయరాం ప్రసాద్, పట్టణ సీఐ పీవీ ఆంజనేయులకు వెంటనే ఆ విషయంలో చెక్ పోస్టుల వద్ద ఉన్న సీసీ కెమెరాలు ఫుటేజీని ఆధారంగా గుర్తించి అదుపులో తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట గురజాల డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.